# సంకెళ్ళు

''సీతా! ఇవాళ నీ కూతుర్ని ఆఫీసుకు వెళ్ళొద్దన్నాని చెప్పు--'' నిద్రలేస్తూనే వంటింటి గుమ్మం దగ్గరికి వచ్చి, కాఫీ కలుపుతున్న భార్యతో అన్నాడు శంకరం.

కాఫీ, గ్లాసులో పోసి, భర్తకందిస్తూ '' ఎందుకని'' అడిగింది సీత.

'' ఇవాళ దాన్ని చూసుకోవడానికి పెళ్ళి వారొస్తున్నారు.'' కాఫీ సిప్ చేస్తూ అన్నాడు.

సీత కొంచెం కోపంగా అన్నది. '' ఆ విషయం ఇప్పుడా చెప్పడం.. ఒకరోజు ముందు చెబితే మీ సొమ్మేం పోయింది.''

'' ఇంకా నయం, ఓ నెల ముందు నోటిస్ ఇవ్వమనలేదు. అయినా నాకు మాత్రం ఏం తెలుసు? నిన్న సాయంకాలం నేను ఆఫీసు నుంచి బయల్దేరే ముందు ఫోన్ చేశారు పెళ్ళికొడుకు తరపువాళ్ళు--- ఇవాళ వస్తామంటే సరేలే రమ్మన్నాను.''

'' అంటారు --- మీ కేం -- ఉద్యోగం చేస్తున్న పిల్లకి కొన్ని విషయాలు ముందు చెపితే బాగుంటుంది. దానికి వీలు కుదరొద్దూ -- అస్తమానం పెళ్ళి చూపులంటూ లీవులు పెడితే ఆఫీసర్లు ఊరుకొంటారా? ఆదివారాలు పెట్టుకోవచ్చుగా - '' రుసరుసలాడుతూ వంటకి ఉపక్రమించింది ఆవిడ...

''వాళ్ళకి టిఫిన్ అరటికాయ బజ్జీలు చేయి-'' ఓ హుకుం జారీ చేసి వెళ్ళిపోయాడు శంకరం. అప్పుడే మంచం మీంచి లేస్తోన్న మాధవికి తల్లిదండ్రులు మాట్లాడుకుంటున్న మాటలు వినిపించాయి. నెమ్మదిగా లేచి బెడ్‌షీట్ మడతపెట్టి, పెరట్లో ఉన్న వాష్‌బేసిన్ దగ్గరికి వెళ్ళిపోయింది పళ్ళుతోముకోవడానికి.

ఆమె మొహం తుడుచుకుంటూ వంటింట్లోకి రాగానే సీత అన్నది -

''ఫ్లాస్కులో కాఫీ ఉంది - తాగు'' మాధవి నిశ్శబ్దంగా ఫ్లాస్కులోంచి కాఫి గ్లాసులో పోసుకుని బైటికి నడవబోతుంటే అన్నది సీత.

'' ఇవాళ ఆఫీస్‌కి సెలవు పెట్టు - ఈ మాట మీ నాన్నగారు చెప్పమన్నారు.''

మాధవి ఆగిపోయింది

'' ఎందుకు? అడిగింది వెనక్కి తిరక్కుండా '' ఎవరో వస్తున్నార్ట - నిన్ను చూసుకోడానికి.

మాధవి వెనక్కి తిరిగి ఆవిడ్ని చూస్తూ అన్నది --

''అమ్మా! ఈ విధంగా నేను నెలకి నాలుగు రోజులు పెళ్ళిచూపులంటూ లీవులు పెడుతోంటే - ఆ ఉద్యోగం ఊడిపోతుంది.

''నేనేం చేయనే'' - నిస్సహాయంగా అన్నది ఆవిడ.

'' ఏం ? వాళ్ళు సాయంకాలం రాకుడాదా ఆదివారం రాకూడదా!''

''వాళ్ళొచ్చేది సాయంకాలమే - కానీ ఈ లోపల నువ్వు ఆఫీసుకెళ్ళి - అలిసిపోయి ఆలస్యంగా ఇంటికి వచ్చి - బస్సులందలేదు - అదిలేదు - ఇదిలేదని వంకలు చెప్పే లోపే వాళ్ళొచ్చేస్తారు. నన్ను చీవాట్లేస్తారు. మీ అమ్మాయికి భయం, భక్తి లేదు - ఇలా ఉద్యోగం పేరుతో చీకటి పడిందాకా తిరుగుతుందా! అని - కాస్త నా పరువు నిలబెట్టే ప్రయత్నం చేయి - '' ఎప్పుడక్కడికి వచ్చాడో తల్లికూతుళ్ళ సంభాషణ విన్న శంకరం సీరియస్‌గా అన్నాడు.

'' ఏవిటి నాన్నా! ఇలా ప్రతిసారీ - లీవ్‌లు పెడితే ఎవరూరుకుంటారు? - అయినా నేనేం కావాలని లేట్‌గా వస్తానా? బస్సులందవు - ఆ రష్- ట్రాఫిక్ - ఎన్ని ఇబ్బందులో మీకేం తెలుసు - ''చికాకు అణుచుకొంటూ అన్నది మాధవి..

'' ఆ - అవును - నువ్వొక్కదానివే అక్కడికి ఉద్యోగం చేసేది - నీతోటి వాళ్ళెవరూ ఉద్యోగాలు చేయడం లేదా! నేను వెళ్ళి రావడం లేదా - మీ అన్నయ్య వెళ్ళి రావడం లేదా ఆఫీసుకి.''

''మీరు మగవాళ్ళు - బస్సులు దొరక్కపోతే ఎవరినైన లిఫ్ట్ అడిగి వస్తుంటారు.. నేనలా వస్తే ఊరుకొంటారా?

''కాళ్ళిరక్కొడతాను - ఇంకా ఎక్కువ మాట్లాడితే పళ్ళు కూడా రాలతాయి - వెళ్ళు - అనవసరంగా వాదించకుండా - నోర్మూసుకుని ఇంట్లో కూర్చో - '' హూంకరించాడు శంకరం.

మాధవి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి - గిర్రుక్కున లోపలికెళ్ళి మంచం మీద వాలిపోయింది. శంకరం మూర్తీభవించిన పురుషాహంకారి. ఇంట్లో ఆయన మాటే నెగ్గాలన్నది ఆయన పంతం. సీతాదేవి నిజంగానే అపర సీతాదేవిలా సహనం మూర్తీభవించి ఉండేది - రానురానూ ఆయన అహంకారం మూర్ఖత్వంగా మారి, ఆవిడ సహనాన్ని పరీక్షించడంతో నెమ్మదిగా - కొంత తిరుగుబాటు తత్వం అలవాటు చేసుకుంది. కానీ కొన్ని విషయాల్లో, ముఖ్యంగా ఇంటి విషయాలు, మాధవి విషయం - ఆయన శాసించినట్టే జరగాలి - పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి, ఉద్యోగం చేసుకుంటూ చట్ట ప్రకారం పూర్తిగా స్వతంత్రురాలైన కూతురు ఇంకా తన చెప్పుచేతల్లోనే ఉండాలని భావిస్తాడాయన. ఆయనలా భావించడం అటు సీతక్కాని, ఇటు మాధవిక్కాని ఇష్టంలేదు - భర్త సృష్టించిన ఈ ఇల్లనే బందిఖానాలో తను శాశ్వతఖైదీ అయిపోవడం ఎలాగూ జరిగింది - కూతురికైనా స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలుండాలన్నది సీత కోరిక -

కాని అటు శంకరం, ఇటు ముమ్మూర్తులా తండ్రి గుణాలే అబ్బిన కొడుకు కాశీ కూడా ఆవిడ కోరికను అర్థం చేసుకోలేదు - మాధవి భావాలు తెలుసుకోడానికి ప్రయత్నించలేదు.

మాధవి కాలేజీ ఉన్న రోజుల్లో ఇల్లు, కాలేజీ తప్ప మరో చోటికి వెళ్ళే అవకాశం కలగనీయలేదు తండ్రీ కొడుకులు - ఇప్పుడు ఉద్యోగం చేస్తున్నా - ఆమె మీద నిఘాయే -

అది భరించలేని మాధవి అన్నగారి మీద మండిపడుతుంటుంది. అప్పుడప్పుడూ--

'' ఇలా నామీద అస్తమానం నిఘా వేసి ఉంచేకన్నా, చదువు సంధ్యలు - ఉద్యోగం ఏం లేకుండా బాల్య వివాహం చేస్తే పోయేదిగా - ఓ పదిమంది పిల్లల తల్లినై హాయిగా ఏ వంటింటి గడపలోనో పడుకునేదాన్ని''

''అలా అయితే బాగా ఉండేది - కానీ ఇది బాల్య వివాహాల సమాజమూ కాదు, పోనీ అమెరికాలో లాగా ఆడాళ్ళు విచ్చలవిడిగా తిరిగితే ఊరుకొనే

సమాజమూ కాదు... త్రిశంకు స్వర్గంలాంటి ఈ సమాజంలో నువ్వు నలిగిపోకుండా కాపాడుకోవడం అన్నగా నా ధర్మం – ''చాలా ఓపిగ్గా తాను చేస్తోన్న పనిని సమర్థించుకుంటోన్న అన్నగారిని చూస్తుంటే చాలా జాలేస్తుండేది మాధవికి.

ఎంతలా సమర్థించుకోగలరు ఈ మగవాళ్ళు!

ఎంతలా వంచించుకోగలరు తమ ఆత్మను!

తల్లి, చెల్లి, భార్యల రూపంలో ఉన్న స్త్రీలమీదే, వీళ్ళకున్న బాధ్యత – ధర్మం – అదే పరాయి స్త్రీ అయితే – ఇదేంటిరా పాతకాలం నాయనమ్మలా మాట్లాడుతోందంటారు.

మాధవి ఆలోచిస్తూ – అలా దిగులుగా పడుకొండిపోయింది.

సీత వచ్చి మాధవిని లేపి తలంటుకోమని బ్రతిమాలడంతో బలవంతంగా లేచింది పెళ్ళి చూపులకి. ఓ బలిపశువులా తయారవుతూ అన్నది తల్లితో – ''అమ్మా! ఇదే ఆఖరి పెళ్ళిచూపులు – ఇంక ఈ సారి కూడా ఈ సంబంధం ఏ కారణాన ఐనా కుదరకపోతే నేను ఇంకోసారి నాన్న మాట వినను – ఎప్పుడో, ఎక్కడో నాకు నచ్చినవాడు కనపడిందాకా ఇలా ఉద్యోగం చేసుకొంటూ బ్రతికేస్తాను.

సీతకి బాధనిపించింది.

నిజమే – దాదాపు ఇది పదో సంబంధం. ఈ ఏడాదిలోనే పది సంబంధాలు వచ్చి, ఏదీ కుదరకపోతే ఏ ఆడపిల్లైనా బాధపడుతుంది. నిజానికి మాధవి అప్సరస కాదు అలాగని కురూపి కాదు. చదువుంది, సంస్కారం ఉంది.

చక్కగా వీణ వాయిస్తుంది

మరి వచ్చే కుర్రాళ్ళకి ఆమె నచ్చకపోవడానికి కారణం ఏమిటి? – అంటే – శంకరం ఇచ్చే కట్నం. ఆయన యాభైవేలు మాధవి పెళ్ళికి దాచి ఉంచాడు. అందులోంచే పెళ్ళి చేయడానికయే ఖర్చు, కట్నం కానుకలు అన్ని జరగాలన్నది ఆయన నిర్ణయం – నిట్టూర్చింది సీత.

'' నీకు ఎంత స్వేచ్ఛ ఉందో, నాకు అంతేగా మధు – నన్ను కోప్పడితే ఎలా? –– నువ్వు నాన్న గారిని ఎదిరించే ధైర్యం సంపాదించుకున్న నాడు

నేను చాలా ఆనందిస్తాను.''

మాధవి తల్లి మాటలకు విస్తుపోయింది.

దీన్ని బట్టి ఆవిడ బర్తతో ఎంత విసిగిపోయిందో అర్థమైంది. వాళ్ళ మాటల్లో ఉండగానే పెళ్ళివారు వచ్చారు. శంకరం చాలా హడావుడి చేశాడు. పెళ్ళికొడుకు అతని తల్లి, అన్నయ్య, తండ్రి వచ్చారు. ఎప్పటిలాగే ఫలహారాల ట్రేతో తలవంచుకొని ( అదిశంకరం ఆజ్ఞ) వాళ్ళ ముందుకు వచ్చింది మాధవి. పరిచయాలు చేశాడు శంకరం.

''నీ పేరేంటమ్మా?'' అడిగింది పెళ్ళికొడుకు తల్లి

''మాధవి'' అని వినయంగా జవాబు ఇచ్చింది.

''బాగుంది'' ఆవిడ కాస్సేపు ఇంకా ఏవో అడిగింది.

అతని తండ్రికి సంగీతమంటే ఇష్టమట? ''సంగీతం వచ్చా?'' అని అడిగారు. మాధవి తలూపేలూగా కాశీ వీణ తెచ్చి ఆమె ఒళ్ళో వుంచాడు. పెళ్ళివారి కోరిక మేరకు ఓ కీర్తన వాయించింది. పెళ్ళికొడుకుని ప్రశ్నలు వేయమన్నారు. అతను వాళ్ళడిగిన ప్రశ్నల్ని మళ్ళీ ఇంగ్లీషులో అడిగాడు. తన భాషా పరిజ్ఞానానికి ఇది పరీక్ష కాబోలు అనుకున్నది మాధవి. ''పెళ్ళయ్యాక ఉద్యోగం చేస్తారా?'' అడిగాడతను.

''చేస్తాను'' థృడంగానే జవాబు ఇచ్చింది.

''నాకు ఇష్టం లేకపోతే''

''నాకు ఇష్టమేగా అందుకే చేస్తాను'' అనాలనుకుంది.

కానీ అనలేకపోయింది. అందుకు కారణం చిన్నప్పటినుంచి తండ్రి తన శరీరంలో ఇంజెక్ట్ చేసిన వినయం, నమ్రత అనే భావాలు – అందుకే మౌనంగా ఊరుకొంది.

'' ఆ ప్రశ్న ఇప్పుడెందుకులేరా.. ఆ ఉద్యోగానికొచ్చే జీతాన్ని బట్టి అప్పుడాలోచిద్దాంలే – అన్నది తల్లి. అతను ఏమి మాట్లాడలేదు.

అంటే పెళ్ళయ్యాక మళ్ళీ తను వీళ్ళ ఆధీనంలో బ్రతకాలన్నమాట – ఈ జీవితం ఇంతేనా బాధగా మూల్గింది మాధవి హృదయం.

''నువ్వు లోపలికి రామ్మా'' మృదుత్వం తెచ్చిపెట్టుకుని అన్నాడు

శంకరం – మాధవి లేచి లోపలికి వచ్చింది. వస్తూ ఓరగా అతనిని చూసింది. పర్వాలేదు అందగాడే అనుకుంది. ఎవరూ అభిప్రాయం అడగలేదు. అబ్బాయిని చూడమనలేదు, ప్రశ్నలు వేయమనలేదు. ఓ గంట తర్వాత వాళ్ళను సాగనంపి వచ్చాడు శంకరం. వస్తూనే ''సీతా మనమ్మాయి అదృష్టవంతురాలు అతనికి నచ్చింది. కట్నం వగైరా కూడా అడ్జస్ట్ అవుతామన్నారు. అబ్బాయి ఎం.బి. ఏ పాసయ్యాడు. ప్రైవేట్ కంపెనిలో ఉద్యోగం. నెలకు ఎనిమిది వేలు జీతం. హాయిగా సుఖపడుతుంది – ఆనందంగా చెప్పాడు. సీత ఓ విధంగా సంతోషించినా ఓ విధంగా బాధపడింది. మాధవిని ఒక్క ముక్క అడగకుండా తనంతట తానే నిర్ణయించి వచ్చాడు. దానికి మనసు ఉంటుందని ఆ మనసుకి కొన్ని ఆశలు, కోరికలు ఉంటాయని ఈయనకు అర్థం కాదా? మాధవి, సీత కళ్ళు కలుసుకుని విడిపోయాయి – మాధవి నిట్టూర్చింది.

తన భావాలకు, అభిప్రాయాలకు విలువ లేనప్పుడు వ్యక్తం చేయడం అనవసరం.

తన ఆశలను అర్థం చేసుకొనే వాళ్ళు లేనప్పుడు వివరించడం కూడా అనవసరం – నెల రోజులు గడిచాయి. పెళ్ళి ముహూర్తం దగ్గర పడింది.

ఆ రోజు ఆఫీసులో ఏదో ఫంక్షన్ జరిగింది. ఆ సందర్భంగా ఆఫీసు వాళ్ళు ఏవో కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా మాధవి వీణ కచేరి ఉంది. అప్పుడప్పుడూ కచేరి ఇవ్వడానికి శంకరాన్ని చాలా బలవంతంగా ఒప్పించింది మాధవి. ఆ పర్మిషన్‌తోటే ఆఫీసులో కచేరికి ఒప్పుకుంది. కానీ ఈ సారి శంకరం ఇహ పెళ్ళి అవుతోంది. ఈ కచేరిలు, వగైరా మానెయి. వాళ్లకు ఇష్టముంటుందో, లేదో అంటూ మందలించాడు.

మాధవి మనస్సు చివుక్కుమంది.

ఈ విషయంలో కూడా తన ఇష్టానికి ప్రాముఖ్యత లేదా? ఛీ.. ఏం బ్రతుకు... తండ్రి మాటలతో తన కచేరి మీద కూడా ఆసక్తి కలగలేదు. కానీ మాట ఇచ్చినందుకు ఆ కార్యక్రమం అయిందనిపించాలని బయల్దేరింది.

మాధవి కళ్ళల్లో అస్పష్టంగా కదిలిన కన్నీటి తెర సీత దృష్టిని దాటిపోలేదు. మాధవి కచ్చేరి పూర్తైన మూడవ రోజు పెళ్ళికొడుకు గిరిధర్

మాధవి ఆఫీసుకు వచ్చాడు.

వస్తూనే ఆమె జీతం, ఆఫీసులోని స్టాఫ్‌మెంబర్స్ గురించి – ఆమె నేచర్ ఆఫ్ జాబ్ అన్నీ వివరాలు అడిగాడు.

అతన్ని తీసుకుని క్యాంటిన్‌కెళ్ళింది. కాఫీ త్రాగుతూ అడిగాడు గిరిధర్.

''మీరు వీణ కచేరీలు ఇస్తుంటారా?'' మాధవి చివ్వున చూసింది.

''అవునూ'' – కొంచెం తీవ్రంగా జవాబు ఇచ్చింది.

''మీవాళ్ళకిష్టమేనా మీరు ప్రోగ్రామ్స్ ఇవ్వడం''

'' ఏమిటీ ప్రశ్న'' – తిక్కరేగింది మాధవికి – ''నాకిష్టం'' అన్నది.

''కానీ మావాళ్లకి ఇష్టం లేదు – ఏదో తోచనప్పుడు కాసేపు ఇంట్లో వాయిస్తే వింటారు మా నాన్నగారు.''

'' మీ సంగతేంటి, మీ కిష్టమేనా''

''సారీ నాకిష్టంలేదు, మీరిలా స్టేజ్ ఎక్కి వందల మంది మధ్య ఈ కచేరీలు చేయడం అసలే ఇష్టంలేదు, మాది సాంప్రదాయకమైన కుటుంబం – ఇలా ఒప్పుకోరు మావాళ్ళు''

''మీ ఉద్దేశ్యం – సాంప్రదాయమైన కుటుంబంలో కచేరీలు చేయరా? సంగీతం, నాట్యం, నాదం... ఇవన్నీ మన సాంప్రదాయలను ప్రతిబింబించే కళలే కదా''.

''అవన్నీ నాకు తేలీదు, కానీ పెళ్ళయ్యాక ఇవ్వన్నీ మీరు మానేయాలి.''

''నేను నేర్చుకొన్నది నాకోసమండి, మరెవరి కోసం కాదు.''

''కానీ మీరు నాతో బ్రతకబోతున్నారు – నా ఇష్టాలు గమనించాలి.'' – మాధవికి మండిపోయింది.

ఏమిటి ఇతని ఉద్దేశ్యం, తన ఇష్టాల సంగతి ఆలోచించడేం. తనకేం అభిరుచులూ, ఆశలు ఉండవా? వీళ్లంతా తనని మనిషిగా గుర్తించరేం – ప్రతివాళ్ళ ఎదురుగా గంగిరెద్దులా తలూపడమేనా. తనకి వ్యక్తిత్వం ఉండకూడదా? అందుకే అన్నది కొంచెం తీవ్రమైన స్వరంతో––

''మిస్టర్ గిరిధర్ మనం భార్యభర్తలం కాబోతున్నాము – కలిసి నూరేళ్ళు

బతకబోతున్నాం, మన జీవన ప్రయాణంలో మన ఇద్దరి అభిరుచులు , ఆశలు, అభిప్రాయాలు పరస్పరం తెలుపుకొని, ఒకరి అభిప్రాయాలు మరొకరు గౌరవించుకోవడం చాలా అవసరం. అందుకే చెబుతున్నాను. వీణ నా ప్రాణం -- ఇన్నాళ్ళూ మా నాన్న, అన్నయ్యల ఆధీనంలో నా ఆశలు, ఆశయాలు అన్ని అణచివేసుకున్నాను. కనీసం పెళ్ళయ్యాకనైనా నాకు ప్రాథమిక హక్కులైన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు లభిస్తాయని ఆశించాను. కానీ వాటికి మీరు ఆదిలోనే అడ్డుగోడలు నిర్మించాలని ఆరాటపడుతున్నారు --- మీ ఉద్దేశ్యంలో భార్య అంటే బానిసలా పడి ఉండాలనా? - భార్య జీవితాంతం తోడుండే ఓ స్నేహితురాలిగా మీరు భావించేటట్లైతేనే మన పెళ్ళి జరుగుతుంది. నేను చేయని నేరానికి ఇంతకాలం జైళ్ళోనే ఉన్నాను. పెళ్ళి అనే పేరుతో ఈ జైలులోనుండి మరో జైలులోకి పోవడం నాకిష్టంలేదు---''

గిరిధర్ కొంచెం ఆశ్చర్యపోయి చూసి, అంతలోనే తేరుకుని అన్నాడు -- ''మీరు నాకెంతో నచ్చారు - - అందుకే మీ నాన్నగారు కట్నం తక్కువగా ఇస్తానన్నా పట్టించుకోలేదు - కానీ మీరు నా అభిప్రాయాలను, నా తల్లితండ్రుల ఆలోచనలను అర్ధం చేసుకోకపోతే మాత్రం - సహించను - మీరు నాకు నచ్చారు - కానీ - మీ ఆలోచనలే నచ్చలేదు - మార్చుకోవాలి.

మాధవికి అతని మాటలు వింటే అసహ్యం వేసింది -- ఇలాంటి మనిషితో జీవితం గడిపేకన్నా, జీవితాంతం కన్యగా మిగిలిపోవడం ఉత్తమం - అందుకే అన్నది కొంచెం కఠినంగా - మరికొంత ధృడంగా'' ''మీరూ నాకు నచ్చారు - కానీ మీ బుద్ధే నచ్చలేదు - మార్చుకోగలరా!'' గిరిధర్ విసురుగా లేచాడు.

''హౌ డేర్ యూ - యిలాంటి పొగరుబోతును నేను భార్యగా భరించలేను - ''

''మీలాంటి సంకుచితుణ్ణి నేనూ భర్తగా భరించలేను గుడ్ బై'' చర చరా లేచి ఆఫీసువైపునడిచింది.

విశాలాంధ్ర
తేది 6-10-96